క్లుప్తంగా

యూనిఫాంలు పంపిణీ

మానవపాడు: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం ఇటిక్యాల, ఎర్రవెల్లి, అలంపూర్ మండలాలల అంగన్‌వాడీ సెంటర్లకు సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు రెక్టాంగిల్, టేబుల్, ప్లేమేట్స్, బుక్ ర్యాక్స్ ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు తీసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ధరూర్ మండలానికి చెందిన ఎరుకలి వెంకటేష్ సోమవారం తెల్లవారు జామున గద్వాల నుంచి రాయచూర్‌కు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న సమాచారం మేరకు పట్టణ శివారులో తనిఖీ చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బొలెరా వాహనం, బియ్యాన్ని సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రామప్పస్వామికి అష్టోత్తర పూజలు

రాజోళి: మండల కేంద్రం రాజోళిలోని తుంగభద్ర నది మధ్యలోని రాంపాటి శివాలయంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రామలింగేశ్వర స్వామికి అష్టోత్తర శతానామావళి, అర్చన, అభిషేకాది క్రతువులు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భజనలు, సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివునికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ఎర్రవల్లి: మండల పరిధిలోని వేముల గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈనెల 18 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.50,016, రెండో బహుమతి రూ.30,016, మూడో బహుమతి రూ.15,016 నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించి టీమ్ పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93471 76286, 83094 18471 నంబర్లను సంప్రదించగలరని పేర్కొన్నారు.

కొనసాగుతున్న తరగతి గదుల నిర్మాణం



అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న రెండు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రెండు నెలల కిందట రూ.45 లక్షలు మంజూరు చేశారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు నెలల వ్యవధిలో తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ నరేష్ తెలిపారు. వీటితో పాఠశాలకు అదనంగా మరో రూ.26 లక్షలు తరగతి గది కోసం మంజూరయ్యాయని, వీటిని సైతం పూర్తి చేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో వెలసిన శ్రీసయ్యద్‌షా మహబూబ్ ఉస్సేనీ దర్గా ఉర్సు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ దర్గా వద్దకు చేరుకొని కందూర్లను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహబూబ్ ఉస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూల చాదర్లను సమర్పించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



శాంతినగర్ పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



హనుమంతు రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న అయిజ పోలీసులు



ఇటిక్యాలపాడులో ముందస్తు అరెస్టులో మాజీ సర్పంచ్

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. సోమవారం చలో అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌ల ధర్నాకు వెళ్తున్న నేపథ్యంలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు లోకేశ్వర్ రెడ్డి, శేషన్ గౌడ్, శివ రాముడు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు అరెస్ట్..

అయిజ : చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు హన్మంతురెడ్డిని సోమవారం పోలీసులు గుడిదొడ్డిలో అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు.

మాజీ సర్పంచ్‌లు అరెస్ట్..

శాంతినగర్ : అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తాజా మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామనగర్ సర్పంచ్ ఆంజనేయులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. అక్రమంగా అరెస్టులు చేయించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు.

'పేర్లు లేకుండా అవమానం'



మాట్లాడుతున్న శెట్టిఆత్మకూర్ లక్ష్మణ్

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని 2వ వార్డులో బసవన్న చౌరస్తా ప్రారంభోత్సవంలో స్థానిక ఎమ్మెల్యేకు ఫొటోలపై ఉన్న ధ్యాస ప్రోటోకాల్‌పై లేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బసవన్న చౌరస్తా ప్రారంభోత్సవంలో శిలాఫలకంపై ఎంపీ మల్లురవి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదార రాజనర్సింహ్మా, ఎమ్మెల్సీల పేర్లు లేకుండా ఏర్పాటు చేసి అవమానం చేశారన్నారు. వెంటనే ఆ శిలాఫలాకాన్ని తొలగించి, ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాలమహానాడు శ్రీనివాసులు, బంగినవీన్, రాముడు, జయన్న, అనిల్, రాజశేఖర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే



కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతోంది. అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండల కేంద్రంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి సత్యన్న ఆధ్వర్యంలో ఇంటింటి ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్లు ఉరుకుందు, కొండన్న, యుగంధర్, శకుంతల, వీరేష్, వీరన్న, సవిత, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మానవపాడు: మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ చంద్రన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ కాల్చకుండ డంపింగ్ యార్డ్‌కు తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన



మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

గద్వాల : జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సోమవారం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేశారు. దీక్ష శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. 20 ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, జనార్దన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామంజనేయులు, యువరాజు, నర్సింహ, ఎస్ఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ సాహెదాబేగం



కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

కేటీదొడ్డి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వహించొద్దని నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ సాహెదాబేగం అన్నారు. మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెనూ ప్రకారం తప్పకుండా విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ భోజనం చేశారు. ఆర్ఐ దేవేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరూరు : మండల పరిధిలోని జాంపల్లి, ధరూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. రికార్డులు పరరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయ భవనం



తహసీల్దార్ కార్యాలయంలో కడ్డీలు తేలిన పైకప్పు

రాజోళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు, ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదంలో జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నారు. వడ్డేపల్లి ఉమ్మడి మండలం సమయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కోసం నిర్మించిన భవనం కావడంతో మండల ఏర్పాటు అనంతరం ఇదే భవనాన్ని తహసీల్దార్ కార్యాలయముగా మార్చేశారు. కానీ ఇప్పటికే భవనం పైకప్పు పెచ్చులూడి కడ్డీలు తేలి కనిపిస్తుంది. దీంతో కార్యాలయానికి పని నిమిత్తం వచ్చే వారిపై పెచ్చులూడతాయనే ఆందోళనలో ఉన్నారు. నూతన మండలం ఏర్పాటయ్యాక భవనాలే నిర్మించలేదని పాతవాటికి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఆశాల వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి సునీత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బస్సు జాతకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు. మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. ఈ నెల 23న బస్ జాత జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, జిల్లాలోని ఆశావర్కర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకులు కాంతమ్మ, లక్ష్మీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఆర్ విజయ్ కుమార్

ధరూరు : క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని కాంగ్రెస్ నాయకుడు డీఆర్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో క్రిస్మస్‌ను పురస్కరించుకుని ధరూరు యువకులు ఏర్పాటు చేసిన డీపీఎల్ (ధరూరు ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు దుస్తులు అందజేసి పోటీలు ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. నిర్వాహకులు గోవిందు, సురేష్, రాజు, అఖిల్, దర్శెల్లి, గణేష్, రాజు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



అయిజ పోలీస్ స్టేషన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హరీష్

శాంతినగర్ : అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలు, విద్యార్థి యువజన ఉద్యమాలను ఆపలేరని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, రాష్ట్రంలో విచ్చల విడిగా దొరుకుతున్న గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను అరికట్టాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ముందస్తు చర్యల్లో బాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేసి శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. అక్రమంగా విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగబాటు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

అయిజలో :

చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిన పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హరీష్‌ను అరెస్ట్ చేసి అయిజ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల కోసం కార్యక్రమం చేపడితే అక్రమంగా అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చండి సారూ



చాగాపురం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఇటిక్యాల: మండల కేంద్రం నుంచి చాగాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు సక్రమంగా కన్పించక ద్విచక్ర వాహనదారులు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు పూడ్చాలని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీలో మందుల కొరత




పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఇబ్బందుల్లో రోగులు
- నిరాశతో వెనుదిరుగుతున్న వైనం

పాన్‌గల్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మండల కేంద్రాల్లో ఉన్న పీహెచ్‌సీలో సరిపడా మందులు లభించక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు లభించకపోవడంతో కొందరు రోగులు నిరాశతో వెనుదిరుగుతుంటే.. మరికొందరు ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసేందుకు వైద్యులతో స్లిప్పులు రాయించుకుంటున్నారు. పీహెచ్‌సీల్లో మందుల కొరతతో ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పోతుందని పలువురు విమర్శిస్తున్నారు.

మండలంలో..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 10 సబ్ సెంటర్ల పరిధిలో రేమద్దుల, తెల్లరాళ్లపల్లి, మాందాపూర్, అన్నారం, చింతకుంట, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలు ఉన్నా అక్కడ విధులు నిర్వహించే ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు సమయపాలన పాటించకపోవడం, మధ్యాహ్నం తర్వాత కేంద్రాలను మూసి వెళ్లిపోతుండటంతో గ్రామీణులకు సరైన వైద్యం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో చాలా మంది రోగులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీకే వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన వైద్యులు అందుబాటులో ఉన్నా సరిపడా మందులు దొరకపోవడంతో నిరాశ తప్పడంలేదు. పేరుకే మండల కేంద్రం తప్ప మందులు దొరకనప్పుడు ఆస్పత్రి ఎందుకు ఉన్నట్లు అని పలువురు రోగులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రిలో పెయిన్ కిల్లర్, యాంటిబయోటిక్, బీపీ మాత్రలు, రోగ నిరోధకశక్తి పెంచే మందుల కొరత ఉందని వాటి కోసం జిల్లా అధికారులకు నివేదించినట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని రోగులు కోరుతున్నారు.



పీహెచ్‌సీలో మందుల కొరతతో బయటికి రాసిన స్లిప్పు

వారం రోజుల నుంచి తిరుగుతున్నా..



మండల కేంద్రంలోని ఆస్పత్రికి బీపీ మాత్రల కోసం నాలుగు, ఐదు రోజుల నుంచి తిరుగుతున్నా. మాత్రలు లేవని పంపిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. పేద వారి కోసం ఉన్న ఆస్పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచి ఇబ్బందులను తొలగించాలి.

– బుద్దమ్మ, పాన్‌గల్

ప్రైవేట్ దుకాణాల్లో..



కాలి నొప్పితో ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకున్నా. తర్వాత మాత్రలు లేవని చెప్పడంతో షాక్‌కు గురయ్యాను. మాత్రలు లేకుంటే ఏట్లా సారు.. అని అడిగితే ప్రభుత్వం నుంచి సరఫరా కాలేదని వైద్యులు చెప్పారు. అవసరమనుకుంటే స్లిప్పు రాసిస్తాం బయట తీసుకోమని చెప్పినట్లు ఆమె తెలిపింది.

– వెంకటమ్మ, కేతేపల్లి

మందుల కొరత వాస్తవమే

పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉన్నది వాస్తవమే. ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న వాటిని పీహెచ్‌సీలకు అందజేస్తున్నం. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించాం. కొరత ఉన్న మందులు ప్రభుత్వం నుంచి అందిన వెంటనే పీహెచ్‌సీలకు సరఫరా చేస్తాం.

– డా.శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ, వనపర్తి